కలెక్టర్ రాజర్షి షాను సన్మానిస్తున్న జిల్లా అధికారులు

అందరి సహకారంతో

- కలెక్టర్ రాజర్షి షా

సమర్థవంతంగా విధులు

మెదక్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : మెదక్‌లో కలెక్టర్‌గా రాజర్షిషా తనదైన ముద్ర వేశారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా రాజర్షిషా ఆదిలాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్ అధ్యక్షతన జిల్లా అధికారులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడారు. మెదక్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అందరి శాఖలను సమన్వయం చేసుకుంటూ ఏడుపాయల జాతర, కలెక్టరేట్ ప్రారంభోత్సవం, చీఫ్ జస్టిస్ పర్యటన, శాసనసభ ఎన్నికల్లో ఓటరు నమోదు, ఇతర సేవలు అందించానని గుర్తు చేశారు. ప్రజావాణిలో ప్రజా సమస్యలపై స్పందిస్తూ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు జిల్లా అధికార యంత్రాంగం అందించిన సహాయ సహకారాలు మరువలేనివన్నారు. వివిధ శాఖల అధికారులు 13 నెలల పాటు కలెక్టర్‌గా రాజర్షిషాతో కలిసి పని చేసిన విధానాన్ని వ్యక్తపరిచారు. విద్య, వైద్యం సమపాలనలో అందించినప్పుడే మంచి సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. , విద్యాపరంగా ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, క్షేత్రస్థాయిలో పాఠశాలలను ప్రత్యేక అధికారులు పర్యటించి విద్యా ప్రమాణాలతోపాటు సదుపాయాలను పరిశీలించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ యంత్రాంగం చేస్తున్న కృషిని అభినందించారు. సమర్థవంతమైన అధికారులతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించానని సగర్వంగా వివరించారు. మెదక్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోనున్న రాహుల్‌రాజ్‌కు అధికారులు ఇదే స్ఫూర్తిని అందించాలని ఆకాంక్షించారు. అనంతరం రాజర్షి షాను అన్ని శాఖల అధికారులు, టీఎన్జీవో నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్పీ బాలస్వామి, అదనపు ఎస్పీ మహేందర్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్వో పద్మశ్రీ, అదనపు డీఆర్డీఏ శ్రీనివాసరావు, మైన్స్ ఏడీ జయరాజ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఉపాధ్యక్షుడు రాజేశ్‌కుమార్, డీసీహెచ్‌వో చంద్రశేఖర్, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన 'కొప్పోల్'

- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- పెద్దశంకరంపేట నుంచి ప్రత్యేక బస్సులు

కొప్పోల్ ముఖ ద్వారం

కొప్పోల్ ఉమాసంగమేశ్వరాలయం

స్వయంభులింగం

పెద్దశంకరంపేట, మార్చి 5 : దక్షిణ కాశీగా పేరుగాంచిన కొప్పోల్ ఉమాసంగమేశ్వర ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 7వ తేదీన రుత్విక్ వరణం, హోమం, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ, దుర్గాభవాని అభిషేకం, 8వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా రుద్రాభిషేకం, 9వ తేదీన ఉమాసంగమేశ్వరుడి కల్యాణోత్సవం, శకట బ్రహ్మోత్సవం, బండ్లు తిరుగుట, 10వ తేదీన రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పద్మ బాపిరాజు, ప్రధాన కార్యదర్శి కంటిగారి రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి కుమ్మరి శంకరయ్య తెలిపారు. జాతర సందర్భంగా పెద్దశంకరంపేట నుంచి కొప్పోల్ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించారు.

- కొప్పోల్‌కు వెళ్లేందుకు హైదరాబాద్– నాందేడ్– అకోలా 161వ జాతీయ ప్రధాన రహదారిపై ఉన్న పెద్దశంకరంపేటలో దిగితే అక్కడి నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ప్రైవేటు వాహనాల ద్వారా వచ్చేవారు పెద్దశంకరంపేట మీదుగా రావాలి. మెదక్ రహదారిలో వచ్చేవారు శివాయపల్లి చౌరస్తా, రామోజిపల్లి గ్రామాల మీదుగా రావాలి.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

రామాయంపేట రూరల్: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

రామాయంపేట రూరల్, మార్చి 5 : రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పరీక్షల్లో ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆత్మస్థైర్యంతో ఉండాలి

చిన్నశంకరంపేట, మార్చి 5 : పరీక్షల సమయంలో విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాల ని వెళ్లాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. మంగళవారం మిర్జాపల్లి జడ్పీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సం దర్భంగా విద్యార్థులతో మాట్లాడి, ప్రణాళిక బద్ధంగా చదువుకుంటే పరీక్షల్లో తప్పకుండా ఉత్తీర్ణత సాధిస్తారని సూచించారు. పాఠ్యాంశాలను ఇష్టపడి చదువుకోవాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దని సూచించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు.

6 నుంచి 'ఈబాజా' కాంటెస్ట్

నర్సాపూర్, మార్చి 5 : పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నేషనల్ లెవల్ ఈబాజా కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు బీవీఆర్ ఐటీ కళాశాల యాజమాన్యం పేర్కొన్నది. తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ (ఐఅండ్‌సీ, ఐటీ డిపార్ట్‌మెంట్) జయేశ్ రంజన్ హాజరవుతారని వెల్లడించారు.

వైభవంగా బోనాలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 5: పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మాతా రేణుకాంబ బోనాలు ఘనంగా నిర్వహించారు. పసుపులేరు ఒడ్డున గల రేణుకాంబ ఆలయానికి మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సురేందర్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు కృష్ణాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయస్థాయి క్విజ్ పోటీలు

జాతీయస్థాయి క్విజ్ పోటీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 5 : మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం, సెబీ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో(ఆన్‌లైన్) క్విజ్ పోటీ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. 'ఆర్థిక అక్షరాస్యత' అనే అంశంపై నిర్వహిస్తున్న క్విజ్ పోటీ బ్రోచర్‌ను అధ్యాపకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న అన్ని గ్రూపులకు చెందిన విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. క్విజ్ పోటీలు మార్చి 6 నుంచి ఏప్రిల్ నెల చివరి వరకు కొనసాగుతాయని తెలిపారు. విజేతలకు ఎన్ఐఎస్ఎమ్, సెబీ ఆధ్వర్యంలో ముంబైలో నిర్వహించే సమావేశంలో బహుమతులు అందజేస్తారని వివరించారు. క్విజ్ పోటీలకు కన్వీనర్‌గా వాణిజ్యశాస్త్ర అధ్యాపకురాలు హరిత వ్యవహరించనున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు.

చిన్నారులకు అన్నప్రాసన

రామాయంపేట, మార్చి 5 : మండలంలోని రాయిలాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయురాలు సార్గ శ్యామల ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు శ్యామల మాట్లాడుతూ.. చిన్నారులకు ఐదు నెలల వరకు కచ్చితంగా తల్లిపాలు పట్టాలని, ఆరో నెల నిండిన తర్వాతే ప్రతిరోజూ అన్నం తినిపించాలన్నారు. ప్రభుత్వం చిన్నారులకు ప్రత్యేక పౌష్టికాహార పదార్థాలను పంపిణీ చేస్తున్నదని తెలిపారు. ఏఎన్ఎం, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

కొత్తగా పట్టా పుస్తకాలు ఇవ్వాలి

వెల్దుర్తి, మార్చి 5 : మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 158లోని వంద ఎకరాలు అటవీ ప్రాంతంలో ఉన్నాయని, వీటిని 70 మంది రైతులు సాగు చేస్తున్నారు. ఎన్నోఏండ్ల నుంచి భూములను సాగు చేస్తున్నా ఇప్పటివరకు పట్టా పుస్తకాలు ఇవ్వలేదని రైతులు పేర్కొంటున్నారు. కొత్తగా పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని రైతులు మంగళవారం తహసీల్దార్ జ్ఞానజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. 2005లో అప్పటి ప్రభుత్వం 70 మంది రైతులకు పట్టా పాసు పుస్తకాలు ఇచ్చిందన్నారు. అనంతరం ఆ భూములు అటవీ ప్రాంతంలో ఉన్నాయని, కొత్తగా పట్టా పాసుపుస్తకాలు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా కొత్తగా పట్టా పుస్తకాలు ఇచ్చి, రైతు భరోసా వర్తింప చేయాలని కోరారు. రైతులు పోచయ్య, నాగమణి, యాదమ్మ, కిషన్, లింగయ్య, నర్సయ్య, శంకరయ్య ఉన్నారు.

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

మనోహరాబాద్, మార్చి 5 : రాష్ట్రంలోని పలుచోట్ల దొంగతనాలకు చేస్తూ తప్పిం చుకు తిరుగుతున్న ఏడుగురు సభ్యుల దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మనోహరాబాద్ ఎస్సై కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలు... నల్గొండ జిల్లా బుద్ధగౌని తండాకు చెందిన నేనావత్ చందర్, ముదావత్ కమల, ముదావత్ మనీషా, మేగావత్ చంద్రకళ, ఇస్లావత్ రోజా, నూన్యావత్ జ్యోతి, లక్ష్మీ మనోహరాబాద్, తూప్రాన్, రామాయంపేట మండలాలతోపాటు రాష్ట్రంలో పలుచోట్ల దొంగతనాలకు చేస్తూ తప్పించుకు తిరుగుతున్నారు. కాగా, మనోహరాబాద్‌లో తాడేపు మహేందర్‌కు చెందిన సెంట్రింగ్ బాక్సులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. తీగ లాగితే.. డొంక కదిలినట్లు దొంగల ముఠా కదలికలు బయటకు వచ్చాయి. చోరీ కేసు విచారణలో తప్పించుకుని తిరుగుతున్న ఏడుగురిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న జడ్పీటీసీ యాదగిరి

రేగోడ్, మార్చి 5: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను జడ్పీటీసీ అలిగె యాదగిరి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బా లలక్ష్మి, పీసీసీ సభ్యుడు ఎం. కిషన్, చోటుమియా, శ్రీనివాస్‌రెడ్డి, బాబూ పటేల్, హమీద్, శంకర్ తదితరులు ఉన్నారు.

నేడు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడి రాక

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 5: మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే నేపథ్యంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్యపటేల్, యువక మండలి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్‌పటేల్ జిల్లాల పర్యటన చేస్తున్నారు. ఇందులో భాగంగా మెదక్ పట్టణానికి బుధవారం వస్తున్నారని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టి ఉదయ్‌పటేల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు పిట్లం బేష్ మున్నూరు కాపు సంఘం భవనంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు

'విజయ సంకల్ప సభ'కు బీజేపీ శ్రేణులు

కొల్చారం, మార్చి 5: సంగారెడ్డిలో మంగళవారం నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సభకు మండలంలోని రాంపూర్ నుంచి పలువురు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. రాంపూర్ మాజీ సర్పంచ్ సామల యాదగిరి ఆధ్వర్యంలో సంగారెడ్డి సభకు బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు.

మహిళా సాధికారతపై అవగాహన సదస్సు

కొల్చారం, మార్చి 5 : మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా శిశు సంక్షేమశాఖ, హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్‌లో భాగంగా 'బేటీ బచావో–బేటీ పడావో'పై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, మెంటల్ హెల్త్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఇన్‌చార్జి సునీతారాకేశ్ వివరించారు. మహిళా సాధికారికపై జెండర్ స్పెషలిస్టులు నాగమణి, కవిత ప్రసంగించారు. ఫైనాషియల్ లిటరీస్ రమేశ్ సుకన్య సమృద్ధి యోజన, హ్యూమన్ ట్రాఫికింగ్, గుడ్ టచ్–బాడ్ టచ్, 1098, 181, 100 నంబర్లపై అవగాహన కల్పించారు.

PUBLIC NOTICE

The General Public is hereby informed that, my Client: **SMT. BEENA M JAIN,** W/o. SRI MANOJ KUMAR JAIN, R/o. Hyd., has entered into Agreement of Sale to purchase the Agriculture Land to an extent of Ac. 0-18 Guntas in Survey No. 716/2/2, situated at **Kulcharam Village** and Kulcharam Mandal, Medak District, Telangana State, from its Owner **SRI M.LIKITH MANOJ,** S/o. SRI MANDALAPARTHI VENKATA SURYANARAYANA SHARMA, R/o. Hyd. and if any person(s), Banks, Financial Institutes may having any claims, rights, title, interest or objections over the above said property, they may contact the undersigned with all relevant documents in writing within **(7) Seven days** from today, failing which sale transaction would be completed by getting sale deed registered or final transaction and objections if any, received thereafter will not be entertained and deemed to have been waived.

Sd/- **C/o SAI DATTA CONSULTANCY**
DHIRENDRA SINGH, B.Com. LL.M
Advocate, **Ph: 9490932931.**
N. MADHUSUDHAN,
Mobile No. 9676893093.
Office No. 14-4-241/1, Near LMG School, Shahinayathgunj, Begum Bazar, Hyderabad, Telangana State.
Dt: 05-03-2024

20 రోజుల్లో పనులు పూర్తి చేయాలి

మెదక్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను అదనపు కలెక్టర్ రమేశ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు డీఆర్డీవో శ్రీనివాసరావు, పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నర్సింహులు, ఏఈలతో ఉపాధి పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ పనులకు రూ.36 కోట్లు (సీసీ రోడ్ల నిర్మాణం) మంజూరయ్యాయన్నారు. ఎన్నికల కోడ్ దగ్గర పడుతున్న తరుణంలో మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. సీసీ రోడ్డు నిర్మాణాలను ప్రారంభించి, క్షేత్రస్థాయిలో ఎంపీడీవో, ఎంపీవో, ఏఈలు పర్యవేక్షిస్తూ 20 రోజుల్లో పనులను పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

కాంగ్రెస్‌లోకి చేగుంట ఎంపీపీ

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, సొసైటీ చైర్మన్ పరమేశ్

చేగుంట, మార్చి 5 : చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రజనక్ ప్రవీణ్‌కుమార్, రెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ మ్యాకల పరమేశ్, డైరెక్టర్ స్వర్గం సిద్ధిరాములు, వడియారం మాజీ ఉప సర్పంచ్ విఠల్‌రెడ్డి, చందాయిపేట మాజీ సర్పంచ్ స్వర్ణలతాభాగ్యరాజ్, చెట్లతిమ్మాయిపల్లి కమ్మరి రాజుతోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ చేగుంట మండలాధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్, నాయకుడు భాస్కర్, సతీశ్ తదితరులున్నారు.

ఆస్తి తగాదాలో ఒకరు మృతి

లక్ష్మయ్య(ఫైల్)

పాపన్నపేట, మార్చి 5 : భూ తగాదాల్లో జరిగిన ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి పరిస్థితి విషమించి, మృతి చెందిన ఘటన కుర్తివాడ గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాలు.. కుర్తివాడకు చెందిన మెట్టు రాములు, యశోదకు ఇద్దరు కొడుకులు లక్ష్మయ్య(36), యాదగిరి, కూతురు విజయలక్ష్మి ఉన్నారు. కొన్ని ఏండ్లుగా వీరి ఇంటి పక్కన ఉంటున్న పాలివారితో ఆస్తి, భూమి విషయాల్లో గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పంచాయతీలు నిర్వహించినా.. సమస్య పరిష్కారం కాలేదు. దీంతో రాములు పెద్ద కుమారుడు లక్ష్మయ్యపై కక్షగట్టాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ప్రాంతంలో లక్ష్మయ్యపై ఇంటి పక్కన ఉంటున్న మెట్టు సావిత్రి, మెట్టు కిష్టమ్మ, మెట్టు మోహన్, అల్లాదుర్గం దత్తుతోపాటు మరికొందరు బండలు, కర్రలతో దాడి చేశారు. దాడిలో లక్ష్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఘర్షణలో లక్ష్మయ్య కుటుంబీకులు భయంతో అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంలో లక్ష్మయ్యను 108లో మెదక్ ఏరియాదవాఖానకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ దవాఖానకు తరలించగా, ఆరోగ్య పరిస్థితి విషమించి, మంగళవారం ఉదయం లక్ష్మయ్య మృతి చెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నర్సింహులు (ఫైల్)

చిన్నశంకరంపేట, మార్చి 5 : మద్యానికి బానిసై ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం గవ్వలపల్లి చౌరస్తాలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. చిన్నశంకరంపేట మండలం చెన్నాయపల్లి గ్రామానికి చెందిన సాయన్న నర్సింహులు (50) సోమవారం మార్కెట్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి, తిరిగి రాలేదు. గవ్వలపల్లి చౌరస్తాలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన నర్సింహులును గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు కొన్ని రోజులుగా మద్యానికి బానిస అయ్యాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ వివరించారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

మహేశ్(ఫైల్)

చేగుంట, మార్చి 5 : అప్పుల బాధతో ఓ యువ రైతు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్సింగి మండలం వల్లూర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. వల్లూర్ గ్రామానికి చెందిన ఆనందాస్ మహేశ్(35) వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం తన వ్యవసాయ భూమిని అప్పులు తీర్చడానికి విక్రయించాడు. భూమిని అమ్మడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహేశ్ సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం మాలగుట్ట సమీపంలోని చింత చెట్టుకు మహేశ్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులతోపాటు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఆనందాస్ భాగ్యలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీస్‌స్టేషన్ ఎస్సై అహ్మద్ మొయినుద్దీన్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహేశ్‌కు ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా, బీఆర్ఎస్ నాయకుడిగా ప్రజల్లో మంచి పేరు ఉంది. మహేశ్ మృతిపై నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో సొసైటీ చైర్మన్ మృతి

శంకర్‌గౌడ్(ఫైల్)

చేగుంట, మార్చి 5 : గుండెపోటుతో నార్సింగి సొసైటీ చైర్మన్ శంకర్‌గౌడ్ (66) మృతి చెందిన ఘటన నార్సింగిలో మంగళవారం జరిగింది. నార్సింగికి చెందిన శంకర్‌గౌడ్ బంధువుల శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు బయలుదేరాడు. మేడ్చల్‌కు చేరుకోగానే శంకర్‌గౌడ్‌కు గుండెపోటు వచ్చింది. వెంటనే దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. శంకర్‌గౌడ్ మృతిపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నార్సింగి ఎంపీపీ సబీతారవీందర్, జడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలరాం బాబు, వైస్ ఎంపీపీ సుజాతాశంకర్, ఎంపీటీసీలు సత్యనారాయణ, సుజాతా మల్లేశంగౌడ్, మాజీ సర్పంచ్ ఎర్రం అశోక్, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు బాబీ, మాజీ జడ్పీటీసీ సుచరితా కొండల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు సంతాపం వ్యక్తం చేశారు.

మున్సిపల్ అభివృద్ధి పనులపై సమీక్ష

నర్సాపూర్, మార్చి 5 : మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతనలో అధికారులు, సిబ్బందితో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, అభివృద్ధి పనులపై వివరాలు సేకరించి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వేతన సవరణ ప్రతిపాదనలపై వినతి

వెల్దుర్తి, మార్చి 5 : వేతన సవరణలో ఉపాధ్యాయులకు తగిన ప్రాధాన్యత ఇస్తూ, వారి సేవలను గుర్తించి, తగిన ప్రతిపాదనలు చేయాలని ఎస్‌జీటీయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వేతన సవరణ కమిషన్ చైర్మన్ శివశంకర్‌కు మంగళవారం ఎస్‌జీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశం వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్‌లో చైర్మన్ శివశంకర్‌ను కలిసి,వేతన సవరణపై 18 వినతులను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు.

నలుగురు కుటుంబ సభ్యుల అదృశ్యం

అదృశ్యమైన బిజిలీపురం యాదగిరి, జ్యోతి, ఇద్దరు పిల్లలు

తూప్రాన్, మార్చి 5 : పెద్దగుట్ట దర్శనానికి వెళ్లి, వస్తామని చెప్పి వెళ్లిన కుటుంబ సభ్యులు అదృశ్యమైన ఘటన తూప్రాన్‌లో చోటుచేసుకుంది. ఎస్సై శివానందం తెలిపిన వివరాలు.. తూప్రాన్ పట్టణానికి చెందిన బిజిలీపురం సుశీలకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. సుశీల పెద్ద కొడుకు యాదగిరి (37) చిట్టీలు నడుపుతూ జీవిస్తున్నాడు. కాగా, యాదగిరి భార్య జ్యోతి (27), కూతురు మొక్ష (8), కుమారుడు ధ్రువ (3)తో కలిసి ఈ నెల 4న నిజామాబాద్ జిల్లాలోని పెద్దగుట్ట దర్శనానికి వెళ్లారు. సుశీలకు వరసకు మనవడైన భిక్షపతి వారిని ఆటో ఎక్కించాడు. పెద్దగుట్ట చేరుకున్నాక ఫోన్ చేస్తామని చెప్పగా, ఎంతకీ ఫోన్ రాకపోవడంతో ఆందోళన చెందారు. తూప్రాన్‌లో ఉన్న బంధువులు మంగళవారం కారులో వెళ్లి, పెద్దగుట్ట ప్రాంతంలో గాలించినా.. ఆచూకీ లభించలేదు. యాదగిరి తల్లి సుశీల ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు

- 96శాతం హాజరు నమోదు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 5 : ఇంటర్ సెకండియర్ పరీక్షలు మంగళవారం సజావుగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాల్లో 6,157 మంది విద్యార్థులకు 5,882 మంది హాజరుకాగా.. 275 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5,723 మందికి 5,468 మంది హాజరు కాగా, 255 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 443 మందికి 414 మంది హాజరు కాగా, 20 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. జిల్లావ్యాప్తంగా విద్యార్థుల హాజరు 96శాతంగా నమోదైనట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా డిబార్ లేదా మాల్‌ప్రాక్టిస్ ఘటనలు నమోదు కాలేదని తెలిపారు.

'డాక్' అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 5 : ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రధాన పోస్టాఫీస్‌లో డివిజనల్ స్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పోస్టాఫీస్ సూపరింటెండెంట్ శ్రీహరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎవరికైనా సమస్యలు లేదా సందేహాలు ఉంటే 20వ తేదీన సాయంత్రం 4 గంటలకు నిర్వహించే డాక్ అదాలత్‌లో పాల్గొనాలని సూచించారు. సమస్యలు లేదా సందేహాలను 15వ తేదీలోగా పోస్టాఫీసులో ఫిర్యాదు అందజేయాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు
- ముగిసిన మున్సిపల్ బడ్జెట్ సమావేశం

బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

రామాయంపేట, మార్చి 5 : ప్రజా సంక్షేమానికి పార్టీలకు అతీతంగా పని చేస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం రామయంపేట మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముందుగా మహంకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు వార్డుల్లో నెలకొన్నా వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీకి తన సొంత నిధులతో వైకుంఠ రథం ఇస్తానన్నారు. పట్టణాభివృద్ధిలో భాగంగా మల్లె చెరువు సుందరీకరణ, మినీ ట్యాంక్‌బండ్, టూరిజం పార్కు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇంటి పన్నులపై మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌కు పలు సూచనలు చేశారు. సమావేశం అనంతరం స్థానికంగా ఉన్న ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, కమిషనర్ దేవేందర్, తహసీల్దార్ రజినాకుమారి, కౌన్సిలర్లు యాదగిరి, నాగరాజు, అనిల్, సౌభాగ్య, రాధాభవాని, శోభ, కవిత, జయ, గంగాధర్, సుందర్‌సింగ్, కో ఆప్షన్ సభ్యులు ప్రభావతి, హైమద్, కౌసర్‌బేగం, బాలుగౌడ్, మేనేజర్ శ్రీనివాస్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి, నాయకులు ముత్యంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, విప్లవ్, కుమార్, వెంకటేశ్, స్వామి, సిద్ధిరాములు ఉన్నారు.